బద్ది పోచమ్మకు ఘనంగా బోనాలు

అమ్మవారి బోనం సమర్పించేందుకు క్యూలో బారులు తీరిన భక్తులు

రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ బద్ది పోచమ్మకు మంగళవారం భక్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. డప్పుచప్పుళ్ల మధ్య నృత్యం చేస్తూ పురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కల్లు పోసి, సారె పెట్టి బోనాలు సమర్పించారు. అమ్మవారి దర్శనంకోసం భక్తులు గంటల తరబడి క్యూలో నిలబడి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బద్దిపోచమ్మ వీధి సందడిగా కనిపించింది.

– వేములవాడ టౌన్, జనవరి 16

పోటెత్తిన భక్తజనం

- స్వామివారి సన్నిధిలో లక్షకు పైగా భక్తుల పూజలు

రాజన్న ఆలయ ముందు భాగంలో భక్తులు

సమ్మక్క–సారక్క జాతర సమీపిస్తున్నందున వేములవాడ రాజన్న ఆలయం సోమవారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచే భక్తులు పవిత్ర ధర్మగుండంలో స్నానాలు ఆచరించి, రాజన్నకు కోడెమొక్కు తీర్చుకున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నను సుమారు లక్షకు పైగా భక్తులు దర్శించుకోగా, వివిధ అర్జిత సేవల ద్వారా దాదాపు ₹38లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు వెల్లడించారు. అనుబంధ దేవాలయాల్లోనూ రద్దీ నెలకొన్నది. డీఎస్పీ నాగేంద్రాచారి ఆధ్వర్యంలో పట్టణ సీఐ కరుణాకర్ భారీ బందోస్తు ఏర్పాటు చేశారు.

– వేములవాడ టౌన్, జనవరి 16

క్లీన్‌గా కంపోస్ట్‌షెడ్స్

- చెత్త తొలగించడంతో పరిశుభ్రంగా మారిన మామిడిపల్లిలోని కంపోస్ట్‌షెడ్

చెత్తాచెదారం పేరుకుపోవడంతో కోనరావుపేట మండల వ్యాప్తంగా కంపోస్ట్‌షెడ్స్ అస్తవ్యస్తంగా మారాయి. చెత్తాచెదారం కొట్టుకురావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారంటూ ఈ నెల 13న 'నమస్తే తెలంగాణ'లో కంపుకొడుతున్న 'కంపోస్ట్ షెడ్స్' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఎంపీవో రాజు ఆదేశాల మేరకు పారిశుధ్య సిబ్బంది చెత్తాచెదారాన్ని తొలగించడంతో కంపోస్ట్ షెడ్స్ క్లీన్‌గా దర్శనమిస్తున్నాయి.

– కోనరావుపేట, జనవరి 16

ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన విప్

సమ్మేళనానికి హాజరైన విప్ ఆది శ్రీనివాస్‌కు మొక్క అందజేస్తున్న నాయకులు

వేములవాడ, జనవరి 16: జిల్లా వీరశైవ జంగమ సమాజం ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా జంగమ సమాజం అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. వీరశైవ జంగమ అర్చకులకు రాజన్న ఆలయంతో పాటు, శివాలయాల్లో ప్రాతినిధ్యం కల్పించాలని, కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఇక్కడ గణాచారి మఠం సాంబశివుడు, జంగమ సమాజం జిల్లా కోశాధికారి మఠం మృత్యుంజయం, కార్యవర్గ సభ్యులు రాజ మౌళి, సంపత్, పత్రి మల్లేశం, ఎనుగంటి నాగేంద్ర, గొంగళ్ల మల్లేశం, గొంగళ్ల నాగరాజు, మహేశ్వర్ సంతోష్, గొంగళ్ల రాజశేఖర్, నాగరాజు, దేవేందర్, వెన్నెల బాలచందర్, ఎనుగంటి శంకర్, ఎనుగంటి ప్రసాద్, దూపం సతీశ్, తదితరులు ఉన్నారు.

కమనీయం.. రామలింగేశ్వరుడి కల్యాణం

ఉత్సవాల్లో ఎడ్ల బండి ప్రదక్షిణ

ఇల్లంతకుంట, జనవరి 16: జంగంరెడ్డిపల్లిలోని శ్రీ రామలింగేశ్వర ఆలయంలో సోమవావారం శ్రీ రామలింగేశ్వర స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా దేవతా మూర్తుల కల్యాణం జరిపించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎడ్ల బండ్లు, మేకపోతుల బండ్ల ప్రదక్షిణ ఆకట్టుకున్నది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేయగా, ఎస్ఐ సుధాకర్ భారీ బందోబస్తు నిర్వహించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి బలవన్మరణం

ముస్తాబాద్, జనవరి 16: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకోగా, ఆవునూర్‌లో విషాదం నెలకొన్నది. వివరాల్లోకి వెళ్తే.. ఆవునూర్‌కు చెందిన బత్తుల రాజు (35) సిరిసిల్లలో సెంట్రింగ్ పనులు చేస్తుండేవాడు. ₹4లక్షల వరకు అప్పు ఉండడంతో తీర్చే మార్గంలేక సోమవారం సిరిసిల్లలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకెళ్లగా, చికిత్సపొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూమి పూజ

చందుర్తి, జనవరి16: మోహినికుంట మల్లికార్జున స్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు మంగళవారం భూమిపూజ చేశారు. వేములవాడకు చెందిన దర్ర మల్లేశం, గొల్లపల్లికి చెందిన బోల్లు శ్రీనివాస్ 10మీటర్ల ప్రహరీకి భూమిపూజ చేశారు. ఇక్కడ సర్పంచ్ గంగాధర్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఆలయ చైర్మన్ నక్క గంగాధర్, వార్డు సభ్యులు ఉన్నారు.

సిరిసిల్ల రూరల్: మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌కు జ్ఞాపికలు అందించి సన్మానిస్తున్న శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ సభ్యులు

ముస్తాబాద్: మండల ప్రజాప్రతినిధులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పర్యటిస్తూ.. పలుకరిస్తూ..

- జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ బిగ్ టూర్
- సర్పంచులకు ఆత్మీయ సత్కారం
- బీఆర్డీయూ క్యాలెండర్ ఆవిష్కరణ
- మల్యాలలో వాలీబాల్ టోర్నీ ప్రారంభోత్సవం

రాజన్న సిరిసిల్ల, జనవరి16(నమస్తే తెలంగాణ)/ వేములవాడ/ చందుర్తి/గంభీరావుపేట/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/ సిరిసిల్ల రూరల్, జనవరి 16: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్‌తో కలిసి కలియదిరిగారు. ఉదయాన్నే 11:30 గంటలకు జిల్లాకు చేరుకున్న ఆయన, రాత్రి 10 గంటల దాకా ఇక్కడే ఉన్నారు. సిరిసిల్ల పట్టణంలో బీఆర్ఎస్ కార్యకర్త అగ్గి రాములు గృహప్రవేశం చేయగా, టూర్‌లో భాగంగా ముందుగా అతడి నివాసానికే వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల వివాహం చేసుకున్న బీవైనగర్‌కు చెందిన కార్యకర్త గజభీంకార్ బాబు కూతురు, అల్లుడిని ఆశీర్వ దించారు. అనారోగ్యంతో ఉన్న నెహ్రూనగర్ కౌన్సిలర్ గుండ్లపల్లి రామానుజం ఇంటికి చేరుకుని అతడి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పద్మనగర్ కౌన్సిలర్ కుడిక్యాల రవిని పరామర్శించారు. అనంతరం రగుడు వద్ద తెలంగాణ భవన్‌కు చేరుకుని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్పంచుల ఆత్మీయ సత్కారానికి హాజరయ్యారు. 103 సర్పంచులను సన్మానించి, జ్ఞాపికలు అందజేసి వారితో సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం కార్మికశాఖ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముద్రించిన భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను తెలంగాణ భవన్‌లో ఆవిష్కరించారు. తర్వాత చందుర్తి మండలానికి చేరుకుని కేసీఆర్ వాలీబాల్ కప్ టోర్నీని ప్రారంభిం చారు. తిరుగు ప్రయాణంలో తంగళ్లపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో పూజలు చేశారు. తర్వాత వేములవాడలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనరసింహారావు నివాసానికి వచ్చారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య కార్యకర్తలతో కాసేపు ముచ్చటించారు. అనంతరం తేనేటి విందును స్వీకరించి చందుర్తి మండలంలోని ఓ కార్యక్రమానికి వెళ్లారు. తంగళ్లపల్లి లో బీఆర్ఎస్ సీనియర్ నేతలు తిరునహరి భానుమూర్తి, వెంగళ రమేశ్ నివాసానికి వెళ్లా రు. భానుమూర్తి కొడుకు, రమేశ్ కూతురు వివాహాలు ఇటీవలే జరుగగా, నూతన దంపతులను ఆశీర్వదించారు. రాళ్లపేటలో మాజీ సర్పంచ్ ఆసాని బాపురెడ్డి కొడుకును పరామర్శించారు. కస్పెకట్కూర్‌లోని చింతలపల్లిలో బీఆర్ఎస్‌వీ జిల్లా చీమల ప్రశాంత్ యాదవ్ దంపతులను ఆశీర్వదించారు. ఓబులాపూ ర్‌లోని బీఆర్ఎస్‌వీ జిల్లా నేత కొత్త సంతోష్‌గౌ డ్ కొడుకుకు నామకరణం చేయగా, చిన్నారిని ఆశీర్వదించారు. జిల్లెల్లలో డైనమిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దుబ్బా రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నియోజకవర్గ ఇన్ చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, టీపీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సర్పంచుల ఫోరం అధ్యక్షు డు మాట్ల మధు, బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణాధ్య క్షుడు జిందం చక్రపాణి, ఎంపీపీలు జనగామ శరత్‌రావు, మల్లేశం యాదవ్, చంద్రయ్య గౌడ్, బైరగోని లావణ్య, జడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్లు రేగులపాటి చరణ్‌రావు, సందుపట్ల అంజిరెడ్డి, కౌన్సిలర్లు మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, ఇప్పపూల అజయ్, సిరిగిరి రామచందర్, జోగిని శంకర్, నరాల శేఖర్, యాచమనేని శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్లు బండ నర్సయ్యయాదవ్, రామ్మోహన్ రావు, నాయకులు రాఘవరెడ్డి, గూడూరి మధు, నీలం శేఖర్, గోపు బాలరా జు, వెంగళ శ్రీకాంత్‌గౌడ్, నాయకులు ప్రవీణ్, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ వీరబత్తిని కమలాకర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, సీఎం కేసీఆర్ కప్ నిర్వాహకుడు ఈర్లపల్లి రాజు, సర్పంచ్ గట్టు లక్ష్మీనారాయణ, ముస్తాబాద్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కలకొండ కిషన్‌రావు ఉన్నారు.

వేములవాడ: తేనేటి విందులో భాగంగా చల్మెడ నివాసంలో మాట్లాడుకుంటున్న కేటీఆర్, మాజీ ఎంపీ వినోద్, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, లక్ష్మీనరసింహారావు

సిరిసిల్ల రూరల్: తంగళ్లపల్లిలో తిరునహరి భానుమూర్తి నివాసంలో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్

చిన్నారులతో సరదాగా ..

పట్టణంలో రాత్రి వేళ పర్యటించిన తమ అభిమాన నేత కేటీఆర్‌ను చూసి చిన్నారులు, మహిళలు పరుగెత్తుకొచ్చారు. కొంత మంది చిన్నారులు తమ బర్త్‌డే ఉందని చెప్పి సెల్ఫీలు దిగారు. బాగా చదువుకుని అమ్మనాన్నలకు మంచి పేరు తీసుకురావాలని చాక్లెట్‌లు ఇచ్చి ఆశీర్వదించారు. రామన్న చూసి మహిళలు ఇళ్లలో నుంచి బయటకు వచ్చి తమ సమస్యలు చెప్పుకున్నారు. వారిని అప్యాయంగా పలకరించి సమస్యలు విని తానున్నానంటూ భరోసా ఇచ్చారు. అక్కడి నుంచి తంగళ్లపల్లి మండల కేంద్రానికి చేరుకుని నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం మండలంలోని పలుగ్రామాలలో పర్యటించి బీఆర్ఎస్ అనారోగ్యాల బారిన పడ్డ పార్టీ కార్యకర్తలను పరామర్శించారు. రాత్రి పది గంటల వరకు ఆయన పర్యటన సాగింది. తిరిగి హైదరాబాద్ వెళ్లే వరకు కార్యకర్తలు, పల్లెలోని ప్రజలంతా రామన్నవెంటే ఉన్నారు. ఆయన వెళ్లిన ప్రతి గ్రామంలోని ప్రజలంతా ఇళ్ల నుంచి బయటకు వచ్చి కేటీఆర్‌తో సంబురంగా సెల్ఫీలు దిగారు. అందరి అప్యాయంగా పలకరిస్తూ వృద్ధులను దగ్గరకు తీసుకుని ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.

గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల సర్పంచులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, ప్రజాప్రతినిధులు

టీపీఎల్ సీజన్-3 విజేత 'ఆర్ సెవెన్'

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ మానస, మాజీ జడ్పీటీసీ అంతయ్య

సిరిసిల్ల రూరల్, జనవరి16: మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నేత కోడి అంతయ్య ఆధ్వర్యంలో తంగళ్లపల్లిలో టీపీఎల్ సీజన్–3 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా, ఆర్ సెవెన్ జట్టు విన్నర్‌గా, ముద్రకుల వారియర్స్‌కు రన్నర్‌గా నిలిచాయి. ఈ జట్లకు ఎంపీపీ పడిగెల మానస, నాయకులు బహుమతులు ప్రదానం చేశారు. ఇక్కడ పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు ఎడమల శ్రీదర్‌రెడ్డి, ఆదర్శ క్లబ్ అధ్యక్షుడు బత్తిని మల్లేశం, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, కురుమ సంఘ అధ్యక్షుడు కర్ణాకర్, రెడ్డి సంఘ యూత్ అధ్యక్షుడు ఆసాని శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు నులుగొండ శ్రీనివాస్, కోడం భవిత, సుధాకర్, నవీన్, రాజు, ప్రణయ్, నిర్వాహకుడు కడారి నవీన్‌రెడ్డి, బూర సాయి, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

అంబరాన్నంటిన సంబురాలు

వేములవాడ టౌన్: పట్టణంలో ముగ్గు వేస్తున్న మహిళలు

వేములవాడ టౌన్/ ఎల్లారెడ్డిపేట/ ముస్తాబాద్/ ఇల్లంతకుంట/ రుద్రంగి/ కోనరావుపేట, జనవరి 16: జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. ఇంటింటా ఆడబిడ్డల రంగవల్లులు, గంగెద్దుల విన్యాసాలు అలరించాయి. ఇంటింటా వాకిళ్లలో రంగవల్లులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించగా, చిన్నారులు పతంగుల ఎగురవేసి ఉల్లాసంగా గడిపారు. పిండివంటలు చేసుకుని కుటుంబ సభ్యులతో విందు భోజనం ఆరగించి రోజంతా సందడి చేశారు. అల్మాస్‌పూర్‌లోని హరిహర పుత్ర అయ్యప్ప దేవాలయంలో మకర సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపించారు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో ముగ్గుల పోటీలు, రేపాకలో కబడ్డీ పోటీలు నిర్వహించగా, విజేతలకు సర్పంచులు బహుమతులు ప్రదానం చేశారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో జిల్లా స్థాయి బాలీబాల్ పోటీలు నిర్వహించగా, రేపాక క్రీడాకారులు ప్రథమ బహుమతి సాధించారు. ముస్తాబాద్ మండలం తుర్కపల్లి, రామలక్ష్మణులపల్లెతో పాటు పలు గ్రామాల్లో వివిధ క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇక్కడ సర్పంచులు పద్మ, దమ్మ రవీందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. కోనరావుపేట మండలం కనగర్తిలో కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించగా, జైభీమ్ జట్టు విజేతగా, దోస్తాన జట్టు రన్నరప్‌గా నిలిచింది.

అన్నపూర్ణ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయిస్తున్న ఎంపీపీ వెంకటరమణారెడ్డి

'అన్నపూర్ణ' నుంచి నీటి విడుదల

ఇల్లంతకుంట, జనవరి 16: యాసంగి పంటల సాగు కోసం అన్నపూర్ణ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశామని ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన అనంతగిరి శివారులోని అన్నపూర్ణ ప్రాజెక్టు కుడి కాలువ నుంచి నీటిని విడుదల చేశారు. రైతులు సాగునీటి కొరత లేకుండా చూస్తామన్నారు. ఇక్కడ మాజీ సర్పంచ్ వెంకటాచారి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కడగండ్ల తిరుపతి, ఎల్లంగౌడ్, తదితరులు ఉన్నారు.

కనగర్తిలో కాట్రావుల ఆట

కనగర్తి గ్రామంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

కోనరావుపేట, జనవరి 16: కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం కనగర్తి గ్రామంలో కాడెడ్ల కాట్రావుల ఆటను ఆడారు. ఈ సందర్భంగా రెడ్డి కులస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులందరూ పాడిపంటల.. పిల్లాపాపలతో సల్లంగ ఉండేందుకు గానూ ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

వాలీబాల్ టీం అబ్జర్వర్‌గా రవికుమార్

ఎల్లారెడ్డిపేట, జనవరి 16: జనగామలో మంగళవారం నుంచి ఈ నెల 18వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు స్టేట్ అబ్జర్వర్‌గా వెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాల పీడీ దుంపటి రవికుమార్ నియామకమయ్యారు. ఈ సందర్భగా మంగళవారం ఆయనను ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు రాజన్న హుండీ లెక్కింపు

వేములవాడ టౌన్, జనవరి 16: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి హుండీ లెక్కింపును బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ ఓపెన్ స్లాబ్‌పై నిర్వహించే హుండీ లెక్కింపునకు అధికారులు, సిబ్బంది విధిగా ఉదయం 8గంటలకు హాజరుకావాలన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వేములవాడ, జనవరి 16: పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో దుండగులు చొరబడి బంగారు దేవత విగ్రహాలతో పాటు నగదు, వెండి సామగ్రి దొంగిలించారు. వివరాల్లోకి వెళ్తే.. రాజీవ్‌నగర్‌కు చెందిన పిల్లి పుష్పల హైదరాబాద్‌లో తన కూతురు వద్దకు వెళ్లింది. ఇంటికి తాళంవేసి ఉండడాన్ని పసిగట్టిన దొంగలు ఆదివారం అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి బీరువాలోని 30గ్రాముల బంగారు దేవతా విగ్రహాలు, వెండి నగలు, నగదు ఎత్తుకెళ్లారు. పుష్పల ఫిర్యాదు మేరకు పోలీసులు క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించారు. ఘటనా స్థలాన్ని పట్టణ సీఐ కరుణాకర్, ఎస్ఐ రమేశ్ పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ

బోయినపల్లి, జనవరి 16: బోయినపల్లి ఎస్ఐగా శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన మహేందర్‌ను నాలుగు రోజుల క్రితం ఏఆర్‌కు అటాచ్డ్ చేస్తూ ఎస్పీ అఖిల్‌మహాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఎస్ఐ శ్రీకాంత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బోయినపల్లి, జనవరి 16: బోయినపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పూర్వ విద్యార్థుల (1998–99) సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటపాటలతో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించగా, రోజంతా సంబురంగా గడిపారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఇక్కడ అప్పటి హెచ్ఎం భూమయ్య, ఉపాధ్యాయులు రవీందర్, విజయసేనారెడ్డి, రాజేంద్రశర్మ, స్వామి, రాములు, బిల్ల ఆనందం, పీఈటీ లక్ష్మయ్య ఉన్నారు.

విజయవంతం చేయండి

వేములవాడ రూరల్, జనవరి 16: మధ్యాహ్న భోజన కార్మికుల హక్కుల సాధన కోసం ఫిబ్రవరి 4న జిల్లా కేంద్రంలో నిర్వహించే జనరల్ బాడీ సదస్సును విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కడారి రాములు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్ మంగళవారం ఆవిష్కరించారు. ఇక్కడ నాయకులు సత్తవ్వ, లావణ్య, సరోజన, లక్ష్మీ, సాయిలు, నర్సవ్వ, తదితరులు ఉన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

కోనరావుపేట, జనవరి 16: మరిమడ్లలోని పల్లె ప్రకృతి వనంలో బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సర్పంచ్ మాట్ల అశోక్ గ్రామస్తులతో కలిసి భూమి పూజ చేశారు. దాతల సహకారం తో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేశారు. ఇక్కడ ఎంపీటీసీ రేణుక, వార్డు సభ్యులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

సిరిసిల్ల రూరల్, జనవరి16: పెద్దూరులో హనుమాన్ ఆలయ నిర్మాణానికి సర్దార్ యూత్ సభ్యులు మంగళవారం ₹5,116 విరాళంగా అందించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

రాజన్నపేటలో శ్రమదానం

ఎల్లారెడ్డిపేట, జనవరి 16: ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరంలో భాగంగా రాజన్నపేటలో మంగళవారం మూడోరోజు పీహో వాసరవేని పరశురాములు ఆధ్వర్యంలో విద్యార్థులు శ్రమదానం చేశారు. వీధులన్నీ శుభ్రం చేశారు. పరిసరాల శుభ్రత బాధ్యతగా భావిస్తే రోగాలు దరి చేరవని సూచించారు. ఇక్కడ సర్పంచ్ ముక్క శంకర్, తదితరులు ఉన్నారు.

బావిలో జారిపడి అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి

కోనరావుపేట, జనవరి 16: ప్రమాదవశాత్తు బావిలో జారిపడి అసిస్టెంట్ లైన్‌మెన్ మృతిచెందిన ఘటన కొలనూర్‌లో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీరాముల రాజేశం (55) అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గతంలో స్తంభం పై నుంచి పడగా, తలకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి మానసికస్థితి సరిగా లేదు. ఇటీవల కొలనూర్‌కు వచ్చిన ఆయన, వీరవేని వెంకయ్య బావి వైపు వెళ్లగా, ప్రమాదవశాత్తు జారి అందులో పడ్డాడు. సోమవారం తెల్లవారుజామున అటుగా వెళ్లిన రైతు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఎస్ఐ ఆంజనేయులు వివరాలు సేకరించారు. రాజేశం భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.